వెదురుతో ఉపాధి..!

- ఏళ్లుగా వివిధ రకాల వస్తువుల తయారీ
- వెదురు దొరక ఇబ్బంది పడుతున్న కొలాం ఆదివాసీలు
- ప్రభుత్వాలు ఆదుకోవాలని వేడుకోలు



తడక తయారు చేస్తున్న మహిళ



గుల్లా తయారు చేస్తున్న మహిళ

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీలు మైదాన ప్రాంతాలకు దూరంగా ఉంటూ పోడు వ్యవసాయం చేసుకుంటూ అడవి నమ్ముకోని జీవనం కొనసాగిస్తుంటారు. ఆదివాసీ తెగలలో పలు ఆదివాసీ తెగలకు చెందిన వారు అటవీ ప్రాంతాల్లో లభ్యమయ్యే పండ్లు, ఇతర వస్తువులపై ఆధారపడి ఏళ్లుగా జీవనం కొనసాగిస్తున్నారు. ఆదివాసీల తెగలలోని ఓ తెగ వేసవి వచ్చిందంటే చాలు వెదురుతో వివిధ రకాల వస్తువులు తయారు చేస్తూ.. వారం వారం కొనసాగే సమీపంలోని సంతలకు తీసుకెళ్లి వాటిని విక్రయించి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

వెదురుతో వారికి ఉపాధి..

ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఆదిలాబాద్ రూరల్, మావల, జైనథ్, బేల మండలలోని పిప్పల్‌ధరి, దహిగూడ, ఖండాల పోతగూడ, హత్తిగుట్ట, రాజుగూడ, అడ్డగుట్ట, దుబ్బగూడ, మొలాల్‌గుట్ట, తదితర గ్రామాల్లో ఆదివాసీ తెగలలోని కొలాం తెగ నివాసముంటున్నారు. వీరు వేసవి కాలం వచ్చిందంటే అటవీ ప్రాంతాల నుంచి వెదురును తీసుకొని వస్తారు. వాటి ద్వారా వ్యవసాయానికి ఉపయోగించే వస్తువులు సర్దేలు (జొన్న సాగులో ఉపయోగించేవి), కంక కట్టెలు, గుల్లాలు, గుమ్మిలతో పాటు ఇండ్లలో వినియోగించే షాటలు, నిచ్చెనలు తదితర పలు రకాల వస్తువులను తయారు చేస్తూ ఏళ్లుగా జీవనం కొనసాగిస్తూ ఉపాధి పొందుతున్నారు.

ప్రభుత్వం ఆదుకుంటే మేలు..

ఏళ్లుగా వెదురుతో వివిధ రకాల వస్తువులు తయారు చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్న తమకు ప్రభుత్వాలు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని కొలాం తెగకు చెందిన వారు కోరుతున్నారు. అటవీ విస్తీర్ణం అధికంగా ఉన్న చోట వెదురు అధికంగా లభిస్తుందని, అక్కడి నుంచి ప్రభుత్వమే తీసుకువచ్చి ఇస్తే తమకు ఎంతో మేలు ఉంటుందని వారు కోరుతున్నారు.

దూరం నుంచి తీసుకువస్తాం



గతంలో మాకు దగ్గరిలోనే కంకబొంగులు దొరికేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పది కిలో మీటర్ల దూరం వెళ్లి తీసుకువస్తున్నాం. ఒక గంప అమ్మితే సైజును బట్టి రూ. 200 నుంచి రూ. 300 వరకు వస్తాయి. వాటిని చుట్టూ పక్కాల గ్రామాలకు వెళ్లి అంగడీలో అమ్ముతాం. ప్రభుత్వాలు ఆదుకుంటే బాగుంటుంది.

– టేకం మోతీబాయి, మొలాల్‌గుట్ట

తడకలు తయారు చేస్తాం



మా గ్రామంలో ఉన్న 20 కుటుంబాలలో అందరూ వెదురుతో వివిధ రకాల వస్తువులు తయారు చేస్తారు. నేను 35 ఏళ్ల నుంచి వెదురుతో తడకలు తయారు చేస్తున్నాను. ఒక తడక తయారు చేసేటప్పుడు చేతులకు దెబ్బలు కూడా తగులుతాయి. వేసవిలో వ్యవసాయ పనులు ఏమీ ఉండవు.

– కొడప మారు, దహిగూడ

లభించని వెదురు..

గత కొన్నేళ్ల కిందట ఆదివాసీ కొలాం తెగ నివాసముండే కొంత దూరంలోనే వెదురు లభించేది. ప్రస్తుతం సమీపంలో వెదురు లభించకపోవడంతో పదుల కిలో మీటర్ల మేర కాలినడకన వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. మరో పక్కా వేసవిలో అడవి ప్రాంతంలో మంటలు అంటుకోవడంతో వెదురు విత్తనాలు కాలిపోతుండడంతో వెదురు చెట్లు పెరగడం లేదంటూ పలు కొలాం తెగకు చెందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రాణ, ఆస్తి నష్టం జరగనివ్వొద్దు

కైలాస్‌నగర్: విపత్తుల వేళ అధికారులు, స్థానిక యువత స్పందించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. కలెక్టర్ చొరవతో ఆపదమిత్ర పేరుతో ఈనెల 17నుంచి 29వరకు జిల్లాలోని మండల స్థాయి అధికారులు, ఎంపిక చేసిన యువతకు స్థానిక టీటీడీసీలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను గురువారం ఆయన సందర్శించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పాటించాలని సూచించారు. డీఆర్డీవో రాథోడ్ రవీందర్, డీవైఎస్వో వెంకటేశ్వర్లు, వైద్యులు హరీశ్, స్వామి, సిబ్బంది ప్రభాకర్‌స్వామి, మహేందర్ తదితరులున్నారు.

కష్టపడి చదవాలి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జైనథ్ ఆదర్శ పాఠశాలలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. జిల్లా విద్యాధికారి ప్రణీత, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో రవీందర్ నాథ్, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హామీల అమలులో సర్కారు విఫలం'

తలమడుగు: ఎన్నికల వేళ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆరోపించారు. గురువారం మండలకేంద్రంలోని రైతువేదికలో వివిధ గ్రామాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్, కిరణ్ కుమార్, అభిరామ్‌రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంటి, ప్రకాశ్, పల్లవి, రాములు, ప్రకాశ్ రెడ్డి, అబ్దులా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

నేరడిగొండ: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ముత్యాలిబాయి అమ్ము నాయక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆడే నూర్ సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి రజిత, శ్రీనివాస్ రెడ్డి, కరణ్ సింగ్, అంబరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గిరిజన వాగ్దానాలకు తిలోదకాలు'

ఆదిలాబాద్‌టౌన్: బడ్జెట్‌లో గిరిజన వాగ్దానాలకు తిలోదకాలు ఇచ్చారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు అనేక హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. వాటిని నెరవేర్చాలన్నారు.

డిగ్రీ కళాశాలలో చేరండి

ఇచ్చోడ: ఇంటర్ పాసైన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులను కోరారు. గురువారం ఇంటర్ పరీక్షలు ముగిసినందున పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు కళాశాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్యను అందించనున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ సరస్వతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయండి

బోథ్: సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని వాకర్స్ కోరుతున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో యువకులు రన్నింగ్ కోసం వస్తారని పేర్కొంటున్నారు. ఆర్మీ ఉద్యోగాలకు, పోలీస్ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు రన్నింగ్ ట్రాక్ అనుకూలంగా ఉంటుందన్నారు. అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

నార్నూర్: అధైర్య పడొద్దు ప్రభుత్వపరంగా ఆదుకుంటామని రైతు జాదవ్ వెంకట్‌రావుకు సబ్ కలెక్టర్ యువరాజ్ మూర్మ భరోసా ఇచ్చారు. గురువారం మండలంలోని గుండాల గ్రామ సమీపంలో గోధుమ కాలిపోయిన చేనును ఆయన పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నిజామాబాద్ యాంటీ డ్రగ్‌స్క్వాడ్ డీఎస్పీ సోమనాథం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్ పోస్టర్ ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, వైస్ ప్రిన్సిపాల్ రఘు, యాంటీడ్రగ్ కోఆర్డినేటర్ అనిత పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: యువత రాజకీయాల్లో రాణించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని నలంద కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వన్ నేషన్.. వన్ ఎలక్షన్. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ రెండు రోజుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌వైకే అధికారి సుశీల్ బర్ట్, కళాశాల ప్రిన్సిపాల్ పున్నరావ్, వైస్ ప్రిన్సి పాల్ విజయ్ గోపాల్, విశ్రాంత లెక్చరర్లు విజయ్ బాబు, ముకుందరావు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ ఫలాలను అందించాలి

కైలాస్‌నగర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను పేదలకు అందించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అధికారులతో కలిసి అందజేశారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు, తహసీల్దార్లు శ్రీనివాస్, రాజేశ్వరి, విశ్వనాథ్, డీటీ సాయి మహేశ్, ఆర్ఐలు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలా దేవి

ఆదిలాబాద్‌రూరల్: ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారంటే తమకున్న కొద్దిపాటి వ్యవసాయ భూములను రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఇచ్చామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటులో జాప్యం జరగడంతో ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు స్థలంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించారు. భూములు కోల్పోయిన తాము తమ పిల్లలకు ఉద్యోగావకాశాలు లేక జిల్లా కేంద్రంలో తక్కువ వేతనాలతో ఉద్యోగాలు చేయాల్సి వస్తుందన్నారు. అలాగే కొంతమంది రైతులకు పరిహారం డబ్బులు రాలేదన్నారు. కంపెనీ డైరెక్టర్ జీవికే ప్రసాద్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఏర్పాటు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు రావాల్సి ఉందని, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అదనపు కలెక్టర్ శ్యామలా దేవి మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా.. ఫ్యాక్టరీ ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటైతే చాలా మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సమావేశంలో ఆర్డీవో వినోద్ కుమార్, డీఎస్పీ జీవన్ రెడ్డి, వాతావరణ కాలుష్య నియంత్రణ బోర్డు ఇంజనీర్ లక్ష్మణ్ ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, అమరేందర్ పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

ఆదిలాబాద్‌రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, ప్రతిఒక్కరూ స్నేహభావాన్ని పెంపొందించుకుంటూ ఉన్నతస్థాయికి ఎదగాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గత కొన్ని రోజులుగా జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సిరికొండ గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. గెలుపొందిన జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రామీణ క్రీడాకారులు వారి ప్రతిభను కనబరుస్తూ ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఇలాంటి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ సోమన్న, మాజీ ఎంపీపీ గంద్రత్ రమేశ్, సేవ్వా జగదీష్, కుమ్ర రాజు, అప్కం గంగయ్య యాదవ్, దేవన్న, కనక రమణ, రాము పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన ఇన్సూరెన్స్, ఇతరపత్రాలు వెంట ఉంచుకోవా లని సూచించారు. రోడ్డుపై నడిపేటప్పుడు వాహన నిబంధనలు తెలిసి ఉండాలన్నారు. అలాగే ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంద్రవెల్లి: వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్సై దుబ్బక సునీల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వెంట వాహనపత్రాలు ఉంచుకోవాలన్నారు. అదే విధంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు. ఏఎస్సై రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



బావిని పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దటి లేకుండా చూస్తానని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం మండలంలోని అడేగామ(కె), అడేగామ(బి), గుబ్బ గ్రామాల్లో బావులు, బోర్లను పరిశీలించారు. ఈ ఏడాది భూగర్భజలాలు అడుగంటి పోవడంతో పలు గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తినట్లు పేర్కొన్నారు. తప్పని పరిస్థితులు ఉంటే జిల్లా అధికారుల అనుమతితో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీవో సత్యానందం, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నేరడిగొండ: గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం తేజాపూర్, లఖంపూర్, చించోలి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాలకు చెందిన రైతుల మోటార్ల వద్ద నీటి నిల్వ గుంతలను ఏర్పాటు చేసేలా గుర్తించడం జరిగిందన్నారు. ఎక్కడ సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపీవో లక్ష్మణ్, ఏవో కృష్ణవేణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్ ఉన్నారు.

బీసీ సాధికారతే రాహుల్‌గాంధీ లక్ష్యం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బజార్‌హత్నూర్: బీసీ సాధికారతే రాహుల్‌గాంధీ లక్ష్యమని బోథ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సామాజిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అభివృద్ధికి కులగణన చేసి పార్లమెంట్ చట్టం ఆమోదం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు గంగారెడ్డి, గొర్ల రాజుయాదవ్, మల్లేపూల నర్సయ్య, జల్కే పాండురంగ్, పసుల చంటి, రమేష్, పోరెడ్డి నారాయణ, ఇర్ల శివుడు, వెంకట రమణ పాల్గొన్నారు.

పెళ్లికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని సమాక గ్రామానికి ఆదివాసీలు పెళ్లికి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఇంటికీ రూ. 200ల చొప్పున జమచేశారు. కొట్నాక్ దేవ్‌రావ్ పెళ్లికి, తోడసం గౌరుబాయి పెళ్లికి ఖర్చుల కోసం చేరో రూ. 24900 అందజేశారు. ఈసందర్భంగా గ్రామపటేల్ పెందోర్ భగవంత్ రావ్ విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో నిర్వహించే పెళ్లి వేడుకల్లో కట్నాలు, కానుకలు ఇచ్చే సంప్రదాయాన్ని రద్దు చేశామన్నారు. ఇంటికి రూ. 200 చొప్పున జమ చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని అనంతపూర్ గ్రామంలో ఆదివాసీ గిరిజన రైతు దంపతులు సిడం అనుసూయబాయి, అశోక్ కూతురు సేవంత ఇచ్చోడ మండలంలోని బోజుగూడ గ్రామానికి చెందిన నగేశ్‌తో గురువారం వివాహం జరిగింది. పెళ్లి కూతురు సేవంతకు గ్రామస్తులు అందరు కలిసి రూ. 22 వేల నగదును అందజేసి ఆర్థికంగా అండగా నిలిచారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిడం హీరాబాయి మాన్కు, గ్రామ పటేల్ సిడం హీరాలాల్, కోరెంగ భీంరావ్, ఆత్రం జంగు, సిడం గున్వంత్‌రావ్, శంభు, గాంధారిబాయి పాల్గొన్నారు.

నార్నూర్: గాదిగూడ మండలంలోని పున్నగూడ గ్రామానికి చెందిన పెందూర్ ఇంద్రభాన్ ఇంట్లో జరిగే పెళ్లికి బీజేపీ ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొట్నాక్ విజయ్ గురువారం రూ. 5 వేల అందజేశారు. ఆయన వెంట నాయకులు పెందురు సంతోష్, మాడవి యశ్వంతరావు, కొట్నాక లచ్చు, పెందూర్ రమేష్, కనక గంగారాం ఉన్నారు.

ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేయాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బోథ్: రైతులు పండించిన శనగ పంటను ఎకరానికి 12 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతు పండించిన ప్రతీ గింజ ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ఎకరాకు 6.29 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామనడం సరికాదన్నారు. రైతులు దళారులకు నమ్మి మోసపోకుండా పంటను ప్రభుత్వ రంగ సంస్థకు విక్రయించాలని సూచించారు. నాణ్యమైన పంటను మార్కెట్‌కు తీసుకువచ్చి క్వింటాలుకు రూ.5650 మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, విఠల్, కదం ప్రశాంత్, సంధ్యారాణి పాల్గొన్నారు.

కేసీఆర్ వల్లే బోథ్ ఆసుపత్రి నిర్మాణం

బోథ్ నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం పరిశీలించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం జీవో విడుదల చేసి, నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందుతుందన్నారు. వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజనాల రవీంద్ర ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, సురేందర్ యాదవ్, ఎలుక రాజు, బొడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడెల్లి రోడ్డు గురించి అసెంబ్లీలో ప్రస్తావిస్తా

మండలంలోని అడెల్లి రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోవడంతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం రోడ్డును పరిశీలించారు. రోడ్డు పనులు ఆగిపోవడంతో ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చేస్తానన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, సురేందర్ యాదవ్, ఎలుక రాజు, బొడ్డు శ్రీనివాస్, అల్లకొండ ప్రశాంత్ పాల్గొన్నారు.

బోథ్‌లో బహిరంగ ప్రజావాణి

బోథ్: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం బహిరంగ ప్రజావాణి నిర్వహించారు. బోథ్ మండల ప్రత్యేకాధికారి వాజిద్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రాలకు వెవెళ్లకుండా మండల కేంద్రాల్లోనే సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలోని మండల సమైఖ్య కార్యాలయంలో గురువారం ప్రజాఫిర్యాదులపై మహిళా సమైఖ్య సంఘాలకు, వీవోఏలకు అవగాహన కల్పించారు. మండల సమైఖ్య ఏపీఎం సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమం గురించి ప్రజలకు వివరించాలన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

నార్నూర్: వందశాతం ఉత్తీర్ణత సాధించాలని గ్రామ పటేల్ కుంరం జైవంతరావు పటేల్ అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని అర్జుని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు, పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు రాజీపటేల్, ఆత్రం బీర్, గోసాయి, సోనేరావు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బోథ్: అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా సొనాల మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు చెట్లపెల్లి అనిల్, గాజుల పోతన్న, రామాయి రాము, శ్రీధర్, లోలపు పోశెట్టి, గోర్‌బేగ్, అమృత్‌రావ్ పాటిల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉట్నూర్‌రూరల్: బీసీ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చిత్రపటానికి గురువారం బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దూట మహేందర్, క్రాంతి, శ్యాం, భూమన్న, సత్తన్న, సాజిద్, సాయికుమార్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

ఇచ్చోడ: మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ నిలుస్తుందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని సిరిచెల్మలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు అజీం సుల్తాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ టోర్నమెంట్

తాంసి: భీంపూర్ మండలంలోని కమట్‌వాడలో ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో గత పదిహేను రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో శాంతినగర్, రాంపూర్ జట్లు తలపడగా శాంతినగర్ జట్టు శాంతినగర్ జట్టు విజయం సాధించింది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య

తాంసి: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని కళాశాల అధ్యాపకుడు చంద్రకాంత్ తెలిపారు. గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో తాంసి, తలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాల వద్దకు వెళ్లి ప్రవేశాలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, ఆదర్శ పాఠశాలలో గత నెలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆర్‌బీఎస్‌కే సహకారంతో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా దృష్టి లోపం ఉన్న 19 మంది విద్యార్థులకు గురువారం అప్తాల్మిక్ ఆఫీసర్ భాస్కర్‌రావ్ కళ్లద్దాలు పంపిణీ చేశారు.

పరామర్శ

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ గురువారం మండలంలోని పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. వడూర్ గ్రామానికి చెందిన బొడిగె కళ కుమారుడు గణేష్, అదే గ్రామానికి చెందిన గడం భోజవ్వ అనారోగ్యంతో చనిపోవడంతో బాధిత కుటుంబం ఇంటికీ వెళ్లి పరామర్శించారు.

ఇన్విజిలేటర్ల కేటాయింపును సవరించాలి

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పరీక్షల్లో ఇన్విజిలేటర్ల కేటాయింపును సవరించాలని ఎస్టీయూ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడుగు నరేందర్, వెంకటేశ్ చౌటపెల్లిలు అన్నారు. గురువారం జిల్లా విద్య శాఖాధికారి ప్రణీతకు వినతిపత్రం అందజేశారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యవసాయ చేనులో కందకాలు, రాళ్ల కట్టాల నిర్మాణం, చెక్‌డ్యాం పనులు సాగుతున్నాయి. గురువారం ఉపాధి పనులను ఎంపీడీవో భాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్ పరిశీలించారు. గ్రామీణ రైతులు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు జాదవ్ విఠల్, మహేందర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.